



జిల్లాలో భారీగా అధికారుల బదిలీలు

- తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సీఐలు ట్రాన్స్‌ఫర్
- జడ్పీ సీఈవో, డీపీవో, డీఆర్‌డీవో పీడీ, డీఎల్‌పీలను సైతం బదిలీ చేసిన ప్రభుత్వం
- జిల్లా అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా బదిలీ
- దీర్ఘకాలికంగా ఉన్నవారికి స్థానచలనం
- పోస్టింగ్‌ల కోసం జోరుగా పైరవీలు

నిజామాబాద్, ఫిబ్రవరి 12: (ప్రత్యేక ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో భారీగా అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. ఇప్పటికే మండల స్థాయిలో పనిచేస్తున్న తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, సీఐలను బదిలీ చేశారు. ఒకట్రెండు రోజుల్లో మరికొంత మంది అధికారులన బదిలీచేయనున్నారు. జిల్లాలో దీర్ఘకాలింగా పనిచేస్తున్న మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారులు కూడా బదిలీ కానున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోసం మూడేళ్ల పూర్తిచేసుకుని గతంలో ఎన్నికల విధుల్లో పనిచేసిన అధికారులందరినీ ఎన్నికల కమిషన్ బదిలీచేయాలని కోరడంతో గడిచిన మూడు రోజులుగా ఈ బదిలీలు కొనసాగుతున్నాయి. ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న డీసీ, ఏసీలను కూడా బదిలీచేశారు.

ఎంపీ ఎన్నికలకు అధికారుల కసరత్తు

ఎంపీ ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఓటర్ల తుది జాబితాను ప్రకటించిన కమిషన్ ఈ నెలలోనే షెడ్యూల్‌ను విడుదలచేయనుంది. ఆలోపు ఎన్నికలను ఎలాంటి ఆరోపణలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు ఆయా జిల్లాల పరిధిలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని ఆదేశాలివ్వడంతో ప్రభుత్వం ఈ బదిలీలను కొనసాగిస్తుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున తహసీల్దార్‌లను, ఎంపీడీవోలను, పోలీసు అధికారులను జిల్లా స్థాయిలో పనిచేస్తున్న ఆర్డీవోలు, అదనపు కలెక్టర్‌లను బదిలీ చేశారు. ఈ బదిలీల్లో భాగంగా జిల్లాలో 20 మండలాల పరిధిలోని ఎంపీడీవోలు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. మల్టీజోన్‌లలో పనిచేస్తున్న ఎంపీడీవోలను జిల్లాకు నియమించారు. ఎన్నికలతో ప్రత్యక్ష సంబంధాలుండి గత ఎన్నికల్లో పనిచేసిన అధికారులందరినీ బదిలీచేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, నోడల్ ఆఫీసర్లు, ఇతర అధికారులను బదిలీ చేస్తున్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో ఆరోపణలు వచ్చిన అధికారులను కూడా ఈ బదిలీల్లో భాగస్వామ్యం చేస్తున్నారు.

జిల్లా నూతన అదనపు కలెక్టర్‌గా అంకిత్



జిల్లా నూతన అదనపు కలెక్టర్‌అంకిత్

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా పనిచేస్తున్న చిత్రా మిశ్రాను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమెను ఏటూరు నాగారం ఐటీడీఏ పీవోగా బదిలీ చేసింది. అక్కడ పనిచేస్తున్న అంకిత్‌ను జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులను జారీ చేశారు. వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు ఇచ్చారు. చిత్రామిశ్రా జిల్లాలో మూడేళ్లగా అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. గతంలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా కూడా పనిచేశారు. ఆమె 2019 ఐఏఎస్‌లో సెలక్ట్ అయ్యారు. జిల్లాకు వస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్ సైతం 2019 బ్యాచ్‌కు చెందినవారే.

జిల్లాలో పనిచేస్తున్న కీలకశాఖల జిల్లాస్థాయి అధికారులను ప్రభుత్వం బదిలీచేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న సీఈవో, డిప్యూటీ సీఈవోలు, డీపీఓ, డీఎల్‌పీలను బదిలీ అయ్యారు. వీరితో పాటు జిల్లా ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌లను కూడా బదిలీచేసి వారి స్థానంలో కొత్తవారిని నియమించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కీలక శాఖల అధికారులను బదిలీచేశారు. జిల్లా పరిషత్ సీఈవోగా సుదీర్ఘకాలం పనిచేస్తున్న ఐ.గో విందు బదిలీ అయ్యారు. ఆయనను జడ్పీ సీఈవోగా నియమించారు. నాగర్‌కర్నూల్ జడ్పీ సీఈ వోగా పనిచేస్తున్న డి.ఉషను ఆయన స్థానంలో నియమించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారిగా పనిచేస్తున్న చందర్‌నాయక్ బదిలీ అయ్యారు. ఆయనను కామారెడ్డి జడ్పీ సీఈవోగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న జడ్పీ సీఈవో సాయాగౌడ్‌ను నిజామాబాద్ డీఆర్‌డీవో అధికారిగా నియమించారు. జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ పెరిక జయసుధను బదిలీచేసి వికారాబాద్ డీపీవోగా నియమించారు. వికారాబాద్ డీపీవోగా విధులు నిర్వహిస్తున్న చక్రవర్తి తరుణ్‌కుమార్‌ను జిల్లా డీపీవోగా నియమించారు. జిల్లాలో పనిచేస్తున్న డీఎల్‌పీవోలను కూడా బదిలీచేశారు. ఆర్మూర్‌లో పనిచేస్తున్న పి.వెంకటశ్రీనివాస్‌ను కామారెడ్డికి, బోధన్‌లో పనిచేస్తున్న మహ్మద్ గౌస్‌ను జగిత్యాలకు, నిజామాబాద్‌లో పనిచేస్తున్న ఎస్.నాగరాజును కామారెడ్డి జిల్లా బాన్సువాడకు బదిలీచేశారు. బాన్సువాడలో పనిచేస్తున్న ముత్యాల శ్రీనివాస్‌ను నిజామాబాద్‌కు, కామారెడ్డిలో పనిచేస్తున్న సాయిబాబాను బోధన్‌కు నిర్మల్ జిల్లా భైంసాలో పనిచేస్తున్న శివకృష్ణను ఆర్మూర్‌కు బదిలీచేశారు. కొత్తగా నియామకమైనవారు ఒకటి రెండు రోజుల్లో జిల్లాలో బాధ్యతలు చేపట్టనున్నారు.

నిజామాబాద్ ఏసీపీ, అదనపు డీసీపీ బదిలీ

నిజామాబాద్ ఏసీపీగా పనిచేస్తున్న కిరణ్ కుమార్‌ను బదిలీ చేశారు. ఆయనను మహబూబ్‌నగర్ బీసీఆర్‌పీ ఏసీపీగా నియమించారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్న రాజవెంకటరెడ్డిని నియమించారు. బాన్సువాడ డీఎస్పీ జగన్నాథరెడ్డిని బదిలీచేశారు. ఆయన స్థానంలో సత్యనారాయణను నియమించారు. అదనపు డీసీపీ జయరాంను బదిలీచేశారు. ఆయన స్థానంలో నారాయణను నియమించారు. అలాగే జిల్లా అదనపు డీసీపీ (ఆపరేషన్స్) గా రమేష్ నియామకం అయ్యారు.

జిల్లాలో కీలక అధికారుల బదిలీలు..

ఎక్సైజ్ డీసీ, ఏసీలకు స్థానచలనం

జిల్లాలో పనిచేస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌లను ప్రభుత్వం బదిలీచేసింది. వీరి స్థానంలో కొత్తవారిని నియమించింది. జిల్లాలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న పి.దశరథ్‌ను రంగారెడ్డి జిల్లా డీసీగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆర్.కిషన్‌ను రంగారెడ్డి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీగా బదిలీల చేసింది. ఆయన స్థానంలో రంగారెడ్డిలో టీఎస్‌బీసీఎల్ చీఫ్ మేనేజర్‌గా పనిచేస్తున్న వి.సోమిరెడ్డిని ఏసీగా నియమించింది.

జిల్లాలో పసుపునకు భారీ డిమాండ్

- క్వింటా 13వేల 965 రూపాయలు పలికిన ధర



నిజామాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పసుపునకు భారీ ధర వచ్చింది. సోమవారం మార్కెట్‌కు 13వేల క్వింటాళ్ల వరకు పసుపును తీసుకురాగా అత్యధికంగా క్వింటాలు 13వేల 965రూపాయల ధర పలికింది. మార్కెట్‌కు సోమవారం భారీగా పసుపు వచ్చింది. మార్కెట్‌కు వచ్చిన పసుపునకు సాధారణ ధర క్వింటాలు 8వేల నుంచి 13వేల మధ్య ధర పలికింది. కొద్దిమంది రైతులు తీసుకువచ్చిన పసుపు మాత్రం క్వింటాలు 13వేల 965 రూపాయల ధర వచ్చింది. ఈ సంవత్సరం అత్యధికంగా ఇదే ధరఅని మార్కెట్ అధికారులు తెలిపారు. నెలరోజులుగా ధర పెరుగుతుందని మార్కెట్ కార్యదర్శి వెంకటేశం తెలిపారు.



గోమాతకు పూజలు చేస్తున్న ఎంపీ అర్వింద్

నరేంద్రమోదీ పాలనలో సంస్కృతిని మళ్లీ నిర్మించుకుందాం

- ఎంపీ ధర్మపురి అర్వింద్

బోధన్ రూరల్, ఫిబ్రవరి 12: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో మళ్లీ మన సంస్కృతిని నిర్మించుకుందామని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర ఆలయం వద్ద గల గోశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గోమాతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినంతా మాత్రనా ఎగరకూడదని, సంస్కృతికి వ్యతిరేకంగా పనులు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. దేశం మొత్తం మోదీ హవా నడుస్తుందని, 500 ఏళ్ల కలగా ఉన్న అయోధ్య రామమందిరం నిర్మాణంలో దేశం మొత్తం మోదీ వైపు చూస్తుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి మరోసారి బీజేపీ గెలుస్తుందని, బీజేపీ గెలుపును మోదీకి జిల్లాను బహుమతిగా అందజేస్తామన్నారు. బోధన్ పట్టణంలో శిథిలావస్థలో ఉన్న ఆలయాలను పునఃనిర్మాణం చేసే విధంగా కృషి చేస్తామన్నారు. అయోధ్యలో శ్రీ బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠతో భారతీయుల చిరకాల స్వప్నం నెరవేరిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డి మోహన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సుదాకర్‌చారి, పట్టణ అధ్యక్షుడు బాల్‌రాజ్, గోశాల నిర్వాహకులు నేపాల్‌సింగ్, వినోద్ పట్వారి, కైలాసప్ప, హరి, శివచరణ్‌లతో బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

కిడ్నాపర్ అనుకొని చంపేశారు

- నగరంలో అమానుష ఘటన
- కర్రలతో కొట్టిచంపిన స్థానికులు
- కేసు నమోదు చేసిన పోలీసులు



స్థానికుల దాడిలో మృతి చెందిన వ్యక్తి

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 12: జిల్లా కేంద్రంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. చిన్న పిల్లలను కిడ్నాప్ చేయడానికి వచ్చాడన్న అనుమానంతో స్థానికులు ఓ వ్యక్తిని కొట్టిచంపిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. నగరంలోని 14వ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్‌లో సోమవారం ఉదయం 8 గంటల సమయంలో ఓ వ్యక్తి గల్లీల్లో అనుమానంగా తిరుగుతున్నాడని కొందరు గమనించారు. ఆ వ్యక్తిని స్థానికులు పలు పశ్నలు వేసినా స్పందించకపోవడంతో ఆయనపై అనుమానం పెరిగింది. వేషధారణ, ముఖానికి దస్తీకట్టుకోవడంతో ఆ వ్యక్తిని స్థానికులు అనుమానించారు. ఇటీవల చిన్న పిల్లలను ఎత్తుకెళ్తున్నారన్న ప్రచారం విస్తృతంగా సాగుతుండటంతో స్థానికులు ఆ వ్యక్తిని కిడ్నాపర్‌గా భావించారు. అది పిల్లలు పాఠశాలలకు వెళ్లే సమయం కావడం, తల్లిదండ్రులు ఎక్కువ మంది గుమిగూడారు. తలా ఒక్క మాట మాట్లాడి చివరకు ఆ వ్యక్తిని కిడ్నాపర్‌గా భావించారు. స్థానికుల్లో కొందరు ఆ వ్యక్తిని కర్రలతో విచక్షణారహితంగా చితకబాదారు. కొందరు 4వ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. తీవ్రంగా గాయపడటంతో పాటు శ్వాసకు ఇబ్బంది పడటంతో పోలీసులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆ వ్యక్తి మరణించాడు. అయితే ఆ వ్యక్తి రూరల్ పరిధిలోని ఖానాపూర్‌కు చెందిన రాజుగా స్థానికులు గుర్తించారు. అతను ఎవ్వరూ లేని అనాథ అని, ఎప్పుడూ మహిళా వేషధారణలోనే ఉంటాడని, కొన్నేళ్లుగా పశువుల కాపరిగా పనిచేశాడని తెలిపారు. నిజామాబాద్ నగరానికి వచ్చి భిక్షాటన చేస్తూ పొట్టనింపుకుంటాడని ఖానాపూర్ వాసులు తెలిపారు. అమాయక వ్యక్తిని అనుమానించి తీవ్రంగా కొట్టి ప్రాణాలు తీశారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను స్థానికులు వీడియోలు, ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో వార్త వైరల్‌గా మారింది. వీడియోలు, ఫొటోల ఆధారంగా ఐదుగురిపై కేసు నమోదుచేసినట్లు 4వ పట్టణ పోలీసులు తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్‌శింగేనేవార్

జిల్లాలో కిడ్నాప్ ముఠా లేదు

- ప్రజలు అపోహలను నమ్మొద్దు
- పోలీసు కమిషనర్ కల్మేశ్వర్

ఖిల్లా, ఫిబ్రవరి 12: జిల్లాలో చిన్నపిల్లల కిడ్నాపింగ్ ముఠా అంటూ ఏదీ లేదని కేవలం సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అలాంటి ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని సీపీ కల్మేశ్వర్‌శింగేనేవారు అన్నారు. కాలనీల్లో అనుమానితులు సంచరిస్తే వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించాలే కాని దాడులకు పాల్పడరాదని సీపీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కమాండ్ కంట్రోల్ సమావేశపు హాల్‌లో మీడియాతో చర్చాగోష్టిలో మాట్లాడారు. ఇటీవల జిల్లాలో మూడు చోట్ల జరిగిన చిన్నపిల్లల కిడ్నాప్ ఘటనలకు ఒకదానికి ఒకదానితో సంబంధం లేదని తెలిపారు. ఆర్మూర్, రూరల్, నిజామాబాద్‌లో జరిగిన పిల్లల కిడ్నాప్‌ల దుండగులను పట్టుకుని వారి వద్ద నుంచి పిల్లను సైతం స్వాధీనం చేసుకుని వారి వారి కుటుంబసభ్యులకు అప్పగించడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 15ఘటనల్లో ప్రజలు అనుమానితులపై దాడులు చేయడం వల్ల వారు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.



- సంజీవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

తుది దశకు ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 12: జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల ఈవీఎం గోదాంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్‌లెవెల్ చెకింగ్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు ఈవీఎం గోదాంలను సందర్శించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో చెకింగ్ ప్రక్రియను పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్‌ల పనితీరు పరిశీలన కోసం ఈసీఐ ఎల్ ఇంజనీర్లు నిర్వహిస్తున్న ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నియమనిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా ఎఫ్ఎల్‌సీ పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ సూచించారు. గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్రక్రియను కలెక్టర్ ప్రతి రోజూ పరిశీలించారు. మొత్తం 2904 బ్యాలెట్ యూనిట్లు, 2014కంట్రోల్‌యూనిట్లు, 2345 వీవీ ప్యాట్‌లకుగాను ఆదివారం నాటికే 57, 74,58 శాతం పరిశీలన పూర్తయిందని అధికారులు తెలిపారు.

డీఆర్‌డీఏ ఏపీడీ మృతి పట్ల సంతాపం

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరక్టర్ సంజీవ్‌కుమార్ ఈనెల 9న అకాల మృతి చెందడంపై జిల్లా యంత్రాంగం సంతాపం తెలుపుతూ సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో సంజీవ్‌కుమార్ చిత్రపటానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా, డీఆర్‌డీవో చందర్ తదితరులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సంజీవ్‌కుమార్ సేవలను కొనియాడారు.

అనుమతుల కోసం అడ్డదారులు

- జిల్లాలో ప్రైవేటు పాఠశాలల ఏర్పాటులో అక్రమాలు
- నకిలీ సర్టిఫికెట్లతో అనుమతులు పొందుతున్న పాఠశాలలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి12: విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుందంటే చాలు ప్రైవేటు పాఠశాలలు పుట్టగొడుగుల్ల పుట్టుకొస్తున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల అమాయకత్వాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని అనుమతులు లేకుండానే తమకు అనుమతులు వచ్చాయని ప్రచారం చేసుకుంటూ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఎక్కడ కూడా పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం లేదు. ఏదైనా పాత పాఠశాల పేరుపై కొత్త పాఠశాలను ఏర్పాటు చేయాల్సి ఉన్న అవేమి అమలుకు నోచుకోవడం లేదు. యథేచ్ఛగా కార్పొరేట్ విద్యాసంస్థలు స్థానికంగా ఉన్న పాఠశాలలను లీజుకు తీసుకుని తమ పేర్లను చేర్చి విద్యను వ్యాపారంగా మార్చుకుంటున్నారు. ట్రస్ట్ పేరుమీద పాఠశాలలను ఏర్పాటు చేస్తేనే ప్రభుత్వం గుర్తింపు ఇస్తుంది. ఖచ్చితంగా ఆ పాఠశాలకు గవర్నింగ్‌బాడీలు ఉండాలి. కానీ పాతపాఠశాల అనుమతుల మీదనే కొత్త పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నారు. కేవలం కొన్ని పత్రాలను మాత్రమే మార్చి మిగతావాటిని అలాగే ఉంచి అనుమతులను పొందుతు న్నారు. క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే అనుమతులు ఇవ్వాల్సిన విద్యాశాఖ కార్పొరేట్ విద్య సంస్థలు ఇచ్చే కాసు కలకు లొంగిపోయి పత్రాలు లేకున్నా అనుమతులను ఇస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నారాయణ విద్యాసంస్థ బోగస్ పేపర్లతో అనుమతులు పొందినట్లు విద్యార్థి సంఘాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాయి. గతంలోనూ సుభాష్‌నగర్‌లోని లిబర్టీ పాఠశాలకు విద్యాశాఖాధికారులు నిర్మాణం పూర్తికాకుండానే అనుమతులు ఇచ్చి తర్వాత సీజ్ చేసినా ఘటన జరిగింది. ఇలా జిల్లాలో అనేక ప్రైవేటు, కార్పోరేట్ విద్యాసంస్థలు ఏర్పాటుకు కావాలసిన నిబంధనలను, పత్రాలను లేకుండానే తమ కార్యకలాపాలను ప్రారంభిస్తున్నారు. ఇంకా ఈ

విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే అడ్మిషన్ల ప్రక్రియను జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రారంభించాయి. విద్యా సంవత్సరం ముగియక ముందే అడ్మిషన్లు తీసుకునేందుకు అనుమతులు లేకున్నప్పటికీ కొన్ని ప్రైవేటు పాఠశాలలు అడ్మిషన్లకు శ్రీకారం చుట్టాయి.

అనుమతులు లేకుండానే పాఠశాలల మార్పు

నగరంలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు ప్రస్తుతం కొనసాగుతున్న భవనాల్లో కాకుండా ఇతర భవనాల్లోకి తమ పాఠశాలలను మార్చి వేశారు. పాఠశాలల మార్పుకు సంబంధించి ఆర్‌జేడీ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉన్న అనుమతులు లేకుండానే పాతభవనంలో, కొత్తభవనంలో రెండు చోట్ల పాఠశాలలను నిర్వహిస్తున్నారు. కొత్త బ్రాంచ్‌ల పేరుతో తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్లు తీసుకుంటున్నారు. నగరంలోని నాల్గోటౌన్ పోలీసు స్టేషన్ వద్ద గల ఓ పాఠశాల వినాయక్‌నగర్ 100ఫీట్ల రోడ్డులో నూతన బ్రాంచ్‌ను ప్రారంభించింది. ఆరు నెలలుగా అక్కడ తరగతులు నిర్వహిస్తున్నారు. షిఫ్టింగ్‌కు సంబంధించి ఇంకా అనుమతుల ప్రక్రియ ఆర్‌జేడీ కార్యాలయంలో పెండింగ్‌లో ఉండగా అనుమతులు రాకుండానే తరగతులను నిర్వహిస్తున్నారు. సుభాష్‌నగర్‌లోని నారాయణ పాఠశాలకు గతేడాది అనుమతి వచ్చింది. కానీ ఫైర్‌సేఫ్టీ, శానిటేషన్ అనుమతుల విషయంలో పాఠశాలకు అగ్రిమెంట్ కాక ముందే ఇంతకు ముందు కొనసాగిన పాఠశాల పేరు మీద తీసుకున్న సానిటేషన్ సర్టిఫికెట్ పెట్టి అనుమతులు పొందినట్లు విద్యార్థి సంఘాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాయి. ఓల్డ్ ఎన్జీవోస్ కాలనీలో గత ఏడాది నిర్మాణం పూర్తికాకముందే లిబర్టీ పాఠశాలకు విద్యాశాఖ అనుమతులు ఇవ్వడం వివాదస్పదం అయింది. స్వయంగా డీఈవో సీజ్ చేసినా పాఠశాలను సదరు పాఠశాల యజమాని కోర్టుకు వెళ్లి ఓపెన్ చేయడం చర్చనీయాంశమైంది. నగరంలోని వర్ని రోడ్డులో గల బీబీసీ పాఠశాలకు సంబంధించి షిఫ్టింగ్ అనుమతులు లేకుండానే నూతన భవనంలోకి పాఠశాలను మార్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా జిల్లాలో అనుమతులు లేకుండా సుమారు 50పాఠశాలలు కొనసాగుతున్న అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.

అనుమతులు లేని పాఠశాలలను సీజ్ చేయాలి

: రఘురాం, ఏఐఎస్ఎఫ్‌జిల్లా కార్యదర్శి

జిల్లాలో అనేక ప్రైవేటు పాఠశాలలు అనుమతులు లేకుండానే ప్రారంభించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. అనుమతులు లేకుండానే అనుమతులు వచ్చే శాయని ప్రచారం చేసుకుంటూ విద్యార్థులను మోసం చేస్తున్న పాఠశాలలను వెంటనే సీజ్ చేయాలి. ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు ఇచ్చే విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరిస్తే భవిష్యత్తులు ఎలాంటి సమస్యలు ఉండవు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు

: ఎన్‌వీ దుర్గాప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారి

జిల్లాలో అనుమతులు లేని పాఠశాలలపై ఫిర్యాదులు వస్తున్నమాట వాస్తవమే ఈ విషయంలో ఇప్పటికే అన్ని మండల విద్యాశాఖాధికారులకు ఆదేశాలు ఇచ్చాం. అనుమతులు లేని పాఠశాలల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి. అనుమతులు లేని పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించవద్దు. విచారణ జరిపి అనుమతులులేని పాఠశాలలను సీజ్ చేస్తాం.

అటువైపు చూడని అధికారులు

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే పాఠశాలలు వక్రమార్గంలో అనుమతులు పొందు తున్న విద్యాశాఖ అధికారులు మాత్రం వాటిపై చర్యలు తీసుకునేందుకు వెనకాడుతున్నారు. ప్రతి పాఠశాలకు విద్యాశాఖ నుంచే అనుమతులు మంజూరు అవుతాయి. కానీ విద్యాశాఖలో కొన్నేళ్లుగా తిష్ట వేసిన కొంత మంది సిబ్బంది ప్రైవేటు పాఠశాలలు ఇస్తున్న కానుకలకు ఆశపడి సరైన పత్రాలు లేకున్నా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తూ అనుమతుల జారీ విషయంలో అన్నితామై వ్యవహరిస్తున్నారు. గతంలో అనుమతుల విషయంలో సిబ్బంది సస్పెండ్ అయిన సంఘటనలు ఉన్నా వారిలో మాత్రం మార్పు రావడం లేదు.

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతర

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 12: మండలంలోని పడకల్ గ్రామంలో శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఆలయంలో భక్తులు యాజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, యజ్ఞం, బుధవారం స్వామివారి కల్యాణం, సాయంత్రం రథోత్సవం జరగనుందని ఆలయ కమిటీ, వీడీసీ సభ్యులు తెలిపారు. భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



యజ్ఞం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



బాగేపల్లిలో మొరాన్ని ట్రాక్టర్‌లలో తరలిస్తున్న దృశ్యం

యథేచ్ఛగా మొరం అక్రమ రవాణా

రెంజల్, ఫిబ్రవరి 12: ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా యథేచ్ఛగా మొరం తరలిస్తూ.. అక్రమార్జనే ధ్యేయంగా మొరం రవాణాను బాగేపల్లి గ్రామంలో చేపడుతున్నారు. ప్రభుత్వం ద్వారా ఎటువంటి అనుమతి లేకుండా మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా మొరం దందాను సాగిస్తున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్‌లలో మొరం తరలిస్తు అక్రమార్జనకు పాల్పడుతున్న మొరం రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందని అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని వాపోతున్నారు. ప్రభుత్వం నిర్మించిన అలీసాగర్ ప్రాజెక్టు వద్ద అక్రమంగా జేసీబీల సహాయంతో మొరాన్ని తవ్వుతూ ఇతర గ్రామాలకు తరలిస్తున్నారని మొరం తరలింపుపై అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు


పోలీసుల అదుపులో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తులు

ఖిల్లా, ఫిబ్రవరి 12: నగరంలోని ఐదో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్ట్ చేసినట్లు పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగనేవార్ తెలిపారు. ఖచ్చిత మైన సమాచారం మేరకు భారతీ రాణి కాలనీలో నివాసం ఉంటున్న షేక్ ముజీబ్,నజీబ్‌అహ్మద్‌ల ఇంటిపై టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చే శారన్నారు.ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించి ముజీబ్‌ను అదుపులోకి తీసుకుని ఆయన వద్ద నుంచి రూ.46700ల నగదును స్వాధీనం చేసుకున్నారన్నారు. వీరు మహారాష్ట్రలో భారీ ఎత్తున అమాయక ప్రజలను మోసగించి ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలింది. వీరు గతకొంత కాలంగా బెట్టిం గ్ నిర్వహిస్తున్నట్లు వస్తున్న ఆరోపణ నేపథ్యంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్, ఇన్‌స్పెక్టర్లు అజయ్ బాబు, అంజయ్య, ఐదవటౌన్ ఎస్‌ఐ అప్పరావ్,సిబ్బంది దాడి చేశారన్నారు. మిగతా ఐదుగురు పరారీలో ఉన్నారన్నారు.

వృద్ధుల వద్ద డబ్బులను కాజేస్తున్న వారికి దేహశుద్ధి

నవీపేట,ఫిబ్రవరి12: మండలంలోని అబ్బాపూర్(ఎం), జగ్గారావు ఫారం మధ్యన సోమవారం వృద్ధుల నుండి డబ్బులను కాసేస్తున్న ముగ్గురికి యువకులు దేహశుద్ధి చేశారు. నిజామాబాద్ ఆటో నగర్‌కు చెందిన ఇద్దరు, అర్సపల్లికి చెందిన మరొకరు కలిసి ఆటోలో తిరుగుతూ ఒంటరిగా ఉన్న వృద్ధులను తమ ఆటోలో ఎక్కించుకుని ఊరి బయట వారి నుంచి డబ్బులను లాక్కుంటున్న ముగ్గురిని యువకులు దేహశుద్ధి చేశారు. బస్టాండ్, ఆటో స్టాండ్‌ల వద్ద ఒంటరిగా ఉంటున్న వృద్ధులను లక్ష్యంగా చేసుకుని వారి తమ ఆటోలలో ఎక్కించుకుని తమ గ్రామంలో దించుతామని నమ్మబలికి ఊరి బయట వారి వద్ద డబ్బులను లాక్కుంటున్నట్లు సమాచారం రావడంతో నవీపేట, ఫత్తేనగర్‌కు చెందిన పలువురు యువకులు ఆటోను వెంబడించి సంబంధిత ముగ్గురు వ్యక్తులను యువకులు చితకబాది వదిలేశారు.

నవీపేట సీహెచ్‌సీ స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి

● నవీపేట మండల సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు ● ప్రభుత్వ ఆసుపత్రి కబ్జా అంశాల ప్రస్తావన


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంగెం శ్రీనివాస్

నవీపేట,ఫిబ్రవరి12: నవీపేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చెందిన కొంత స్థలం ఇటీవల కబ్జాకు గురైందని సంబంధిత స్థలం కబ్జా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నవీపేట మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. సోమవారం ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆసుపత్రికి సంబంధించిన కొంత స్థలం కబ్జాకు గురవుతుందని పలువురు సభ్యులు సభ దృష్టికి తేగా ఈ తీర్మానం ఆమోదించారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయని ఎంపీటీసీలు మీనా, కృష్ణ మోహన్‌రావు, మండల కోఆప్షన్ సభ్యులు అల్తాఫోద్దీన్ అన్నారు. బినోల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందిని నియమించాలని సభ్యులు కోరారు. 200యూనిట్ల ఉచిత విద్యుత్‌కు సంబంధించిన డాటా ఎంట్రీ చేపట్టడానికి గ్రామాలలో ఎక్కువ సిబ్బందిని నియమించాలని నవీపేట ఎంపీటీసీ సతీష్ కోరారు. నిజాంపూర్ నుండి నాళేశ్వర్ వరకు రూ.6కోట్లతో చేపట్టి రోడ్డు విస్తరణ పనులలో భాగంగా ఐదున్నర మీటర్ల బీటీ రోడ్డు కాకుండా 7మీటర్ల బీటీ రోడ్డును వేయాలని నిజాంపూర్ ఎంపీటీసీ కృష్ణ మోహన్ రావు, నాళేశ్వర్ ఎంపీటీసీ శ్యామల కోరారు. అభంగపట్నం నుంచి నవీపేట వరకు ఉన్న ప్రధాన రహదారిపై స్కూల్ జోన్‌లలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ మీనా కోరారు. అబ్బాపూర్(ఎం) వద్ద సెంట్రల్ లైటింగ్ వెలగడం లేదని ఎంపీటీసీ సాయిలు అన్నారు. ఈ సందర్భంగా నవీపేట నుంచి కామారెడ్డి జిల్లాకు బదిలీ అయిన ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, జడ్పీటీసీ సవిత, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, తహసీల్దార్ ధన్‌వాల్, ఎంపీవో రామకృష్ణ తదితరులున్నారు.

ట్రాన్స్‌జెండర్లపై వస్తున్న పుకార్లను నమ్మొద్దు


మాట్లాడుతున్న ట్రాన్స్‌జెండర్ శ్యామల

పెద్దబజార్, ఫిబ్రవరి 12:ట్రాన్స్‌జెండర్లు కిడ్నాపర్లుగా తమను ఇబ్బందికి గురి చేస్తున్నారని, ట్రాన్స్‌జెండర్ శ్యామల, రక్ష జరీనాలు అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చిన్నపిల్లలను ఎత్తుకెళ్తున్నామని సోషల్‌మడియాలో వస్తున్న పుకార్లలో వాస్తవాలు లేవని అన్నారు. సమాజంలో తాము కూడా మనుషులమేనని మమ్ములను గుర్తించాలని కోరారు. గత 15రోజులుగా ఎక్కడికి వెళ్లిన తమను కిడ్నాపర్లుగా భావిస్తున్నారని అన్నారు.తాము పొట్టకూటి కోసం బిక్షాటనచేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. తాము పెద్దలకు, పిల్లలకు ఆశీర్వాదాలు ఇస్తామే తప్ప వారికి ఎలాంటి హానికలిగించం అని అన్నారు.ఈవిలేకరుల సమావేశంలో ఆరతి, గంగా, ప్రియ, ప్రజ్ఞ, అలకనందతో పాటు 60మంది ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో వైభోపేతంగా ధ్వజారోహనం


బర్దిపూర్ ధ్వజరాహోనం దృశ్యం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 12: మండలంలోని బర్దిపూర్ హరిహర క్షేత్ర ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ వేద బ్రహ్మణులు సోమవారం మంగల వాయిద్యాలతో ధ్వజారోహన కార్యక్రమాన్ని వైభోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అగ్ని ప్రతిష్ఠ, గణపతి హోమం, సుప్రభాత సేవ, నవగ్రహ హోమం, వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు హరిహర క్షేత్రంలో ప్రత్యేక హోమంలో పాలుపంచుకున్నారు. నేడు ఆలయ ప్రాంగణంలో సుదర్శన హోమం, ఉత్సవ విగ్రహల ఊరేగింపు ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో లక్షపుష్పార్చన

కమ్మర్‌పల్లి,ఫిబ్రవరి 12: ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ కన్యకాపరమేశ్వరి మాతఆలయంలో సోమవారం ఆలయ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కమ్మర్‌పల్లి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో లక్షపుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రం శివారులోని శ్రీగిరిక్షేత్రము జంబి హనుమాన్ ఆలయం పక్కనే నూతనంగా నిర్మించిన వాసవీ కన్యకాపరమేశ్వరి మాత ఆలయంలో సోమవారం వామనాశ్రమ మహాస్వామిజీ లక్షపుష్పార్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యుడు ఆమెడ (డిష్) నరేందర్, దొంతుల రమణయ్య, జొన్నల భూషన్, జొన్నల పూర్ణ ప్రసాద్, చిటికేశి రఘు, ఆమేటి శంకర్, నీలి వేణుగోపాల్, సంఘసభ్యులతో పాటు మహిళలు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపులో విద్యారంగంపై చిన్నచూపు

పెర్కిట్, ఫిబ్రవరి12: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యరంగానికి 7.75శాతంలో రూ21వేల 389కోట్లు కేటాయించడం విద్యా రంగంపైన చిన్నచూపు అని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాలయ ఝాన్సీ అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యరంగానికి ప్రాధాన్యత ఇవ్వకుండా బడ్జెట్ కేటాయింపులో అతితక్కువ బడ్జెట్ కేటాయించిన కారణంగా విద్యారంగం నిర్వీర్యమైందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిరాశ మిగిల్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి బడ్జెట్‌లో 30శాతం నిధులు విద్యరంగానికి కేటాయించాలని అన్నారు., లేదంటే గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా విద్యార్థుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని ఏబీవీపీ హెచ్చరించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సునీల్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు సాయి, దుర్గాదాస్, ఆర్మూర్ డివిజన్ ఇన్‌చార్జీ గొడుగు వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధులగుట్టపై ఘనంగా పల్లకీ సేవ

పెర్కిట్, ఫిబ్రవరి12: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శివాలయంలోని సిద్దేశ్వరునికి ప్రత్యేక పూజలు, పల్లకిసేవ ఘనంగా నిర్వహించారు. గుట్టపై గల శివాలయంలో రామాయలంలో, దత్తాత్రేయ, అయ్యప్పస్వామి, దుర్గామాత ఎల్లమ్మతల్లి, ఏకశిల స్తంభం వద్ద హనుమాన్ ఆలయాలలో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకిసేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ భజన మండలి సభ్యులు పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. గుట్టపై ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, బీసీ.గంగారెడ్డి, గంగ కిషన్, బోండ్ల ఆనంద్, కోడిగెల మల్లయ్య, నక్కల లక్ష్మణ్, మీనచంద్, అయ్యప్ప శ్రీనివాస్, చిన్నారెడ్డి, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

పశువులకు గొంతువాపు టీకాలు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి12: పట్టణంలోని వెంటర్నరీ ఆసుపత్రిలో సోమవారం పశువులకు గొంతు వాపు టీకాలను వెంటర్నీ అసిస్టెంట్ రోజా టీకాలను వేశారు. పట్టణంలో గల 146పశువులకు గొంతువాపు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలను వేయడం జరిగిందని, అలాగే రైతుల విజ్ఞప్తి మేరకు ఉదయం 8గంటలకు ఆసుపత్రి తెరిచి ఉంటుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ముప్కాల్, ఫిబ్రవరి12: అండర్-16 విభాగంలో బాలబాలికల కబడ్డీ క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు పీడీ రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం ముప్కాల్ మండల కేంద్రంలోని చైతన్య క్రీడా మైదానంలో నిజామాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు క్రీడలు నిర్వహించి ఎంపిక చేశారు. ఈనెల 16నుంచి 19వ తేదీ వరకు సూర్యాపేట జిల్లాలో ఎంపిక చేసిన క్రీడాకారులు నిజామాబాద్ జట్టు తరపున రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనున్నట్టు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచే విధంగా రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.గంగాధర్, సాయన్న, రిటైర్డు ఉపాధ్యాయుడు అంజయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


గంగాదాస్ (ఫైల్). లక్ష్మణ్ (ఫైల్)

ఇందల్‌వాయి, ఫిబ్రవరి12 : బంధువులను పరామర్శించేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తూ పరలోకానికి వెళ్లిన ఘటన ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... పోలీసు స్టేషన్ పరిధిలోని అన్సాన్‌పల్లి గ్రామ శివారులో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు అతివేగంగా ఉండి అదుపు తప్పడంతో బలంగా ఢీకొనడంతో నల్లవెల్లి గ్రామానికి చెందిన సీరడి గంగాదాస్(42) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు.ఈ ఘటనలో రెండు ద్విచక్రవాహనాలు నుజ్జునుజ్జుఅయినట్లు పోలీసులు తెలిపారు. నందిపేట మండలంలోని తల్వేద గ్రామానికి చెందిన లక్ష్మణ్ (23)ను ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు,మరో వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయన్నారు. నల్లవెల్లి గ్రామానికి చెందిన గంగాదాస్ తన ద్విచక్రవాహనంపై ధర్పల్లి మండలంలోని సీతాయిపేట్ గ్రామంలోని తన బంధువులను పరామర్శించేందుకు వెళ్తూ అన్సాన్‌పల్లి వద్ద ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. మృతుడికి భార్య సాయవ్వ, ఒక కుమారుడు ఉన్నారని మృతుని భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జీ ఎస్‌ఐ ప్రవీణ్ తెలిపారు.

● రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన తలారి శ్రీనివాస్, గోపు బాలరాజు తమ ద్విచక్రవాహనంపై ధర్పల్లి వెళ్తుండగా అన్సాన్‌పల్లి శివారులో రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీ కొన్నారని, ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని 108లో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం గోపుబాలరాజు పరిస్థితి విషమంగా ఉండగా శ్రీనివాస్ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి

- మోకన్‌పల్లి చెరువులో కాళ్లు, చేతులు కట్టి పడి ఉన్న మృతదేహం లభ్యం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన నిజామాబాద్ ఏసీపీ, నార్త్ రూరల్ ఇన్‌చార్జి సీఐ, ఎస్‌ఐలు
- హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ


రొడ్డ నరేష్(ఫైల్)

నవీపేట,ఫిబ్రవరి12: మండలంలోని మోకన్‌పల్లికి చెందిన రొడ్డ నరేష్(30)అనే ఆటో డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ యాదగిరి గౌడ్, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మోకన్‌పల్లికి చెందిన రొడ్డ నరేష్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 10సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన దివ్యను నరేష్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి 9సంవత్సరాల విఘ్నేష్, 7సంవత్సరాల రుత్విక్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 10న భార్య, పిల్లలతో కలిసి ఆటోలో ఎడపల్లి మండలం జానకంపేట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కమలాపూర్ సమీపంలో తన భార్య కోరిక మేరకు దివ్య ఆటోను నడుపుతుండగా కొద్ది దూరంలోనే ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దివ్యతో పాటు ఇద్దరు కుమారులకు స్వల్ప గాయాలు కాగా వారికి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఈ విషయంపై నరేష్‌కు అతని అత్తగారింటి వారితో చిన్నపాటి గొడవ జరిగినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈ నెల 10న బయటకు వెళ్లిన నరేష్ రాత్రికి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. 11వ తేది ఆదివారం రాత్రి నరేష్ అదృశ్యం అయినట్లు నవీపేట పోలీస్ స్టేషన్‌లో అతని తల్లి అబ్బవ్వ ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం స్థానిక గుర్రం చెరువులో నరేష్ మృతదేహం లభ్యమైంది. మృతదేహన్ని చెరువులో నుండి బయటకు తీయగా అతడి రెండు కాళ్లకు ప్లాస్టిక్ వైర్‌తో కట్టి ఉండగా చేతులకు చిన్నపాటి టవల్‌తో కట్టి ఉన్నాయి. సంఘటన స్థలాన్ని నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్, నార్త్ రూరల్ ఇన్‌చార్జి సీఐ సురేష్, ఎస్‌ఐ యాదగిరి గౌడ్‌లు పరిశీలించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నరేష్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కాళ్లు, చేతులు కట్టి వేసి చెరువులో పడేసి హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. కేసును అన్ని కోణాల్లో విచారించి న్యాయం చేస్తామని పోలీసులు బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు. పోస్టుమార్టంకు తరలించిన నరేష్ మృతదేహన్ని ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారి చైతన్య రెడ్డి పరిశీలించారు.

కేంద్ర పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలి

పెద్దబజార్, ఫిబ్రవరి 12:అర్హులైన ప్రతీ ఒక్కరు కేంద్ర పథకాలపై అవగాహన పెంపొందించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. నగరంలోని గాయత్రినగర్‌లో సోమవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర-2 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ వివిధ వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తేవడం జరిగిందన్నారు. అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందాలని అకుంఠిత దీక్షతో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే వీటిని చాల మంది వినియోగించుకుని లబ్దిపొందుతున్నారని తెలిపారు. ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందిన వారిచే సభలో వారి అనుభవాలను అనుభూతులను స్వయంగా వర్ణించారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలను అందుతాయని అందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించుకోవాలని సూచించారు. ఆయుష్మాన్‌భారత్ పీఎం.జేఏవై, పీఎం.ఉజ్వల, పీఎం.పోషణ అభియాన్, జన్‌ధన్ అభియాన్, జీవనజ్యోతి, భీమాయోజన, సురక్షభీమయోజన,అటల్‌పింఛన్ యోజన, ముద్రయోజన తదితర పథకాల గురించి సంబంధిత శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సంక్షేమ పథకాల సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలు, గోడపత్రాలు, క్యాలెండరును ఆవిష్కరించారు.అంతకు ముందు పీఎం ఉజ్వల స్కీమ్ కింద దరఖాస్తు చేసుకున్న వారికి గ్యాస్ కనెక్షన్‌తో పాటు మంజూరి లేఖలను, సిలిండర్లను లబ్ధిదారులకు అర్వింద్ అందించారు. ఈకార్యక్రమంలో సీబీసీ.ఎఫ్.పీవో. ధర్మనాయక్, లీడ్‌బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్‌రావ్, మున్సిపల్ మేనేజర్ రమేష్, ఇన్సూరెన్సు సీనియర్ డివిజనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, శివచరణ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు,తదితరలు, పాల్గొన్నారు.

సుర్బిర్యాల్‌లో ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అన్వేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి12: ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబ్బ రాజేశ్వర్ స్మారక జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. టోర్నమెంట్‌లో మొత్తం 32జట్లు పాల్గొనగా ఫైనల్‌లో సుర్బిర్యాల్, కొత్తపల్లి జట్లు తలపడ్డాయి.హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో సుర్బిర్యాల్ జట్టు విజయం సాధించింది. కొత్తపల్లి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మూర్ ప్రాంతం క్రీడలకు పుట్టినిళ్లు లాంటిదన్నారు. యువకులు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫత్తేపూర్ సొసైటీ చైర్మన్ గడ్డం శ్రావణ్‌రెడ్డి, జిల్లాకబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మోహన్‌దాస్, టోర్నీ నిర్వాహకులు అబ్బ దిలీప్, రాకేష్, సంకేపల్లి గంగాధర్, నగేష్, మునిరాజ, గడ్డి చిన్నయ్య, జె.రాజేశ్వర్, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.


సాటాపూర్ అంగడి బజార్‌లో షెడ్ల ప్రారంభం


అంగడి బజార్ షెడ్లను ప్రారంభిస్తున్న నాబార్డు జనరల్ మేనేజర్ చింతల సుశీల

రెంజల్,ఫిబ్రవరి12: మండలంలోని సాటాపూర్ గ్రామంలోని అంగడి బజార్‌లో నాబార్డు నిధులు రూ.16.69లక్షల వ్యయంతో నిర్మించిన అంగడి బజార్ కార్యాలయం, షెడ్లు, మూత్రశాలలను సోమవారం నాబార్డు జనరల్ మేనేజర్ చింతల సుశీల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలోనే అతి పెద్ద మార్కెట్ అయిన సాటాపూర్ అంగడి బజార్‌లో నాబార్డు నిధుల ద్వారా వ్యాపారుల సౌకర్యార్థం కోసం షెడ్లు, మూత్రశాలలు, కార్యాలయాన్ని నిర్మించి ప్రారంభించడం జరిగిందని అన్నారు. గత వంద సంవత్సరాల నుంచి నడుస్తున్న మార్కెట్ మరింత మెరుగుపడేందుకు మరి కొన్ని షెడ్లను వ్యాపారస్తుల సౌకర్యార్థం నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపిస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మేక విజయ సంతోష్, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీ, మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్, తాజా, వికార్ పాషా, జావీదోద్దీన్, సాయిలు,సంతోష్, కాంట్రాక్టర్ సింహరాయులు తదితరులున్నారు.

సాఫీగా సాగుతున్న వాహనదారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


మాధవనగర్‌లో ఆర్‌యూబీ కింద నిలిచిన నీటిని తొలగించిన దృశ్యం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 12: న త్తనడకన మాధవనగర్ ఆర్వోబీ పనులు అనే వార్త ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు.మాధవనగర్ శివారులో గల ఆర్‌యూబీ కింద నిలిచిన కలుషిత నీటిని సిబ్బందిని తొలగించారు. దీంతో వాహనరాకపోకాలు సాఫీగా జరుగుతున్నాయి. దీంతో యాజమన్యానికి ప్రయాణికులు ధన్యవాదలు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 12: కర్షకులు, కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరీని నిరసిస్తూ ఈనెల 16న కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని టీఎన్‌టీయుసీ రాష్ట్ర కార్యదర్శి కోహెడ నర్సింహులు అన్నారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యలయంలో సోమవారం దేశవ్యాప్త పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను ఎన్‌ఈపి చట్టం, విద్యుత్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి కనీస వేతన చట్టం అమలు పర్చి 26వేల వేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబికసత్యానారయణ, కల్లెడ గంగన్న, బొబ్బ నర్సింగ్‌రావ్, శంకర్, లవంగరాజు, నర్సయ్య, సర్ఫరాజ్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ పదో వార్షికోత్సవం

మెండోర, ఫిబ్రవరి12: మండల కేంద్రంలో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం పదవ వార్షికోత్సవాలు అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్వామివారి గోవిందా నామాల శంకు చక్రలను ప్రతిష్ఠాపన చేశారు. ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాలు ఈనెల 15వ తేదీ వరకు జరగనున్నాయని పేర్కొన్నారు. వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఊరేగించి ప్రతిష్ఠాపన చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. నేడు ధ్వజరోహణం, దేవత ఆహ్వానం, రాత్రికి స్వామివారి ఎదుర్కోలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన 27మంది కోర్టులో హాజరు

●26మందికి రూ.29వేలు జరిమాన ● ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష

ఖిల్లా, ఫిబ్రవరి 12: మద్యం తాగి వాహనం నడిపిన 27మందిని కోర్టు ఎదుట హాజరు పర్చగా 26మందికి రూ.29వేల100లు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారయణ తెలిపారు. ఇందులో ఒకరికి నాలుగు రోజు జైలు శిక్ష విధించినట్లు చెప్పారు. శిక్ష విధించిన వ్యక్తిని కేంద్ర కారాగారానికి తరలించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుప వద్దని ఆయన హెచ్చరించారు.

అనుమానితులను పోలీసులకు అప్పగింత

ఆర్మూర్‌టౌన్ , ఫిబ్రవరి12: ఆలూర్ మండల కేంద్రంలో సోమవారం అనుమా నాస్పందంగా తిరుగుతున్న ఐదుగురు వ్యక్తులను గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు. మండల కేంద్రంలో కృష్ణ జిల్లాకు చెందిన నలుగురు మహిళలు, ఒక వ్యక్తిని కిడ్నాపర్‌లుగా భావించి వివరాలు అడగగా సరియైన సమాధానం రాకపోవడంతో గ్రామస్థులు దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందిం చారు. దీంతో ఐదుగురిని అదుపులోకి తీసుకొనిపోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గోదావరి నదిలో పడి వ్యక్తి ఆత్మహత్య

రెంజల్,ఫిబ్రవరి12: మండలంలోని కందకుర్తి గోదావరి నదిలో పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాకాసిపేట్ గ్రామానికి చెందిన కలీముల్లా(33)అనే వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి నష్టపోవడంతో గత సంవత్సరం నుంచి అప్పులు ఇచ్చే వారికి అప్పులు చెల్లించలేక అప్పులు బాధ తాళలేక జీవితంపై విరక్తి చెంది ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికి చెప్పకుండా తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి వెళ్లిపోయి సాయంత్రం సమయంలో ఫోన్ చేయగా గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ లేపి కందకుర్తి బ్రిడ్జి వద్ద నీళ్లలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడని చెప్పడంతో కుటుంబీకులు సంఘటన స్థలానికి చేరుకోవడం జరిగిందని ఎస్‌ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. కుటుంబీకుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని జాలర్ల సహాయంతో మృతదేహన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య సమ్రీన్ సుల్తానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్ కుమార్ తెలిపారు.

కబ్జాలపై అధికారుల్లో కదలిక

● 1333సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమి పరిశీలన

ముప్కాల్, ఫిబ్రవరి12: బాల్కొండ మండల కేంద్రంలో సర్వేనెంబర్ 1333లో గల ప్రభుత్వ భూమి కబ్జాలకు గురికావడంపై సోమవారం అధికారులు కదలిక మొదలైంది. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వే ల్యాండ్ గందం వెంకటేశ్వర్‌ల బృందం ఆధ్వర్యంలో నలుగురు సర్వేయర్ల బృందం 1333 సర్వేనెంబర్‌లో గల భూమిని క్షేత్రస్థాయిలో పర్యటించి మోకాలిపై పరిస్థితిని ఏమిటో తనిఖీ చేశారు. ఆయా భూముల్లో నిర్మాణాలు ఏమున్నాయి, ఖాళీ స్థలం ఎంత, తదితర వివరాలపై ఆరా తీశారు. 1333సర్వే నెంబర్‌లో 224ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. అంతేగాకుండా తుది నివేదికను జిల్లా కలెక్టర్ సమర్పిస్తామన్నారు. ఆయన వెంట సర్వేయర్లు కిషన్‌నాయక్, సూర్యప్రకాష్, మమత, ఆర్‌ఐ రాఘవేందర్, రెవెన్యూ సిబ్బంది, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, తదితరులు ఉన్నారు.

ప్రజావాణికి 78 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

నిజామాబాద్అర్బన్, ఫిబ్రవరి 12 :ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్రాజీవ్గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 78ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను కలెక్టర్తో పాటు అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా, డీఆర్డివో చందర్, డీపీవో జయసుధలకు విన్నవిస్తూ అర్జీలను సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

● ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్రస్థాయిలో హైదరాబాద్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లాకు సంబందించే ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులకు పంపించడం జరుగుతుందని అధికారులు వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఒక వేళ వినతులు పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరుగవు

●ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ నారాయణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్

డిచ్పల్లి, ఫిబ్రవరి 12: దేశంలో 140కోట్లు జనాభా ఉండగా సుమారు రూ.40కోట్ల వాహనదారులు ఉన్నారని ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు దూరం చేయవచ్చు అని నిజామాబాద్ ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ నారాయణ అన్నారు. 35వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగం సెమినార్ హాల్లో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఆరతి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సుకు ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరు డ్రైవింగ్ శిక్షణతో పాటు లైసెన్స్ కలిగి ఉండాలని వాహనాలకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని ప్రతీ ఒక్కరు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సెల్ ఫోన్ మాట్లాడుతూ.. వాహనాలు నడపరాదని, మద్యం తాగి వాహనాలు నడపడం చట్టప్రకారం నేరమన్నారు. కనీస జాగ్రత్తలు తీసుకున్న ప్రమాదాలు నివారించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే 44రూట్ ఆఫీసర్ వీర్రాజు, ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్ డేటా బేస్ ఆఫీసర్ వర్షనిహంత్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ సతీష్, ప్రొ.సంపత్ కుమార్, డా.ఏ పున్నయ్య, సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

నవీపేటలో నీళ్లు కలిసిన పెట్రోల్ విక్రయం



నవీపేటలో నీళ్లు కలిసిన పెట్రోల్ను చూపిస్తున్న బాధితుడు

నవీపేట,ఫిబ్రవరి12: మండల కేంద్రంలోని కందకుర్తి రోడ్డు మూల మలుపు వద్ద ఉన్న భారత్ పెట్రోల్ బంక్లో ఆదివారం రాత్రి నీళ్లు కలిసిన పెట్రోల్ను విక్రయించారని మండలంలోని రాంపూర్కు చెందిన కొండపల్లి పవన్, పోశెట్టిలు పేర్కొన్నారు. తాము పంట పొలంలో స్ప్రే చేసే పంపు కోసం పెట్రోల్ కొనుగోలు చేసేందుకు బంక్కు వచ్చి 2లీటర్ల పెట్రోల్ను బాటిళ్లలలో పోయించుకున్నామని, అందులో నీళ్లు కలిసిన పెట్రోల్ వచ్చిందని వారు ఆరోపించారు. ఈ విషయాన్ని తాము బంక్ నిర్వాహకులను గట్టిగా నిలదీయగా వారు బంక్ను మూసి వేసుకున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై తగిన విచారణ జరపాలని వారు కోరారు.

సేవలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

ధర్పల్లి, ఫిబ్రవరి12: మహరాజ్ సేవలాల్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ధర్పల్లి మండల బంజార నాయకుడు హంసర్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే సేవలాల్ జయంతిని జరపాలని ఆయన డిమాండ్ చేశారు. బంజారలను కేవలం ఓటు బ్యాంక్గానే అన్ని ప్రభుత్వాలు వాడుకుంటున్నాయని, రాష్ట్రంలో 40లక్షలకు పైగా బంజారల జనాభా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే సేవలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించి ప్రభుత్వ ఆధ్వర్యంలో జయంతిని వేడుకలను జరపాలన్నారు.

డిచ్పల్లి: టీయూలో బంజారాల దైవం శ్రీసంత్ సేవలాల్ మహారాజ్ జయంతి అధికారికంగా నిర్వహిం చాలని టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరికి బంజార సేవ సమితి నాయ ఁకులు వినతి పత్రం అందజేశారు. వర్సిటీలో ప్రతి యేటా సంత్ సేవలాల్ జయంతి అధికారికంగా నిర్వహించిన విధంగానే ఈ ఏడాది అధికారికంగా నిర్వహిచాలని కోరారు.

ఘనంగా మార్కండేయ జయంతి



ఏర్గట్లలో మార్కండేయ శివపార్వతుల శోభాయాత్ర



బోర్గాం(పి)లో మార్కండేయ జయంతిని జరుపుకుంటున్న దృశ్యం

ఏర్గట్ల,ఫిబ్రవరి 12:మార్కడేయ జయంతిని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని శివ మార్కండేయ మందిరం వద్ద పద్మశాలీ సంఘ సభ్యులు జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే పూజా కార్యక్రమాలు నిర్వహించి గ్రామంలో మార్కం డేయ శివపా ర్వతుల శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆల యం వద్ద అన్నదానం నిర్వహించారు. అలాగే గుమ్మిర్యాల్ గ్రామంలో చిలుక తుకారాం ఆధ్వర్యంలో పద్మశాలీ సంఘంలో జయంతి ఉత్స వాలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని భక్త మార్కండేయ ఆలయంలో సోమవారం మార్కండేయుడి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మార్కండేయుడికి ఊయల వేసి లాలి పాటలు పాడారు. సాయంత్రం మార్కండేయుడిని ప్రత్యేక రథంలో ఉంచి పుర వీధులలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిచ్పల్లి: మార్కండేయ జయంతిని పురష్కరించుకొని డిచ్పల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో సంఘ ప్రతినిధులు మార్కండేయ చిత్రపటాకి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. మండలంలోని మిట్టపల్లి, ఖిల్లా డిచ్పల్లి, రాంపూర్, కమలాపూర్, ఘన్పూర్, ధర్మారం, బర్ధిపూర్, సుదులం, కొరట్పల్లి, గ్రామాల్లో మార్కండేయ జయంతి జరుపుకొని అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ కులస్థులు లింబాద్రి,లక్ష్మవత్రి ఆంజనేయులుతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

రుద్రూరు: రుద్రూరులో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీభక్త మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. బాల మార్కండేయుని ఉయ్యాలలో వేసి పాటలు పాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ జయంతి ఉత్సవాల్లో ఎంపీపీ సుజాత, జడ్పీటీసీగంగారాం, పద్మశాలి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్పల్లి: పద్మశాలీల ఆరాధ్యదైవం భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలను కమ్మర్పల్లి మండలవ్యాప్తంగా సోమవారం పద్మశాలీసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఉప్లూర్లో ఓంమార్కండేయ మహార్షి పద్మశాలిసంఘం ఆధ్వర్యంలో భక్తమార్కండేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పోతు లింగమూర్తి, సాంబర్ అశోక్, పోతుగణేష్, శ్రీమల్ల దేవన్న, సంఘసభ్యులు పద్మశాలి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.హసాకొత్తూర్లో నూతనంగా నిర్మించిన సంఘభవనంలో భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. మండలసంఘం అధ్యక్షుడు చింత తిరుపతి, పోతు ధరణి, సంఘం అధ్యక్షుడు పురుశోత్తం, దాశప్రశాంత్, పద్మశాలి కుటంబసభ్యులు పాల్గొన్నారు. మండంలోని బషీరాబాద్లో జరిగిన కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సక్కరం అశోక్, ఎంపీటీసీ తోటజ్యోతి, మహేష్, రమేష్, సర్గం, నగేష్, సంఘసభ్యులు పాల్గొన్నారు. అనంతరం అన్నసత్రం నిర్వహించారు. గ్రామాల్లో మార్కడేయ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

మోపాల్:మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం మార్కండేయ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. మార్కండేయ చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని బోర్గాం(పి),న్యాలకల్, ముదక్పల్లి, తదితర గ్రామాల్లో జయంతిని పద్మశాలీలుఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేముల కిషన్, రచ్చ ఆనంద్, నర్సింహులు, ఆంజనేయులు, వేముల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి: మండల కేంద్రంలో మార్కండేయ జయంతిని సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పాము నారాయణ, ఉపాధ్యాక్షుడు భూమేష్, కార్యదర్శి నారాయణ, కోశాధికారి డాక్టర్ నందు, పురుషోత్తం, స్వామి, రవి, మహేందర్,మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడురాజు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్పల్లి:మండలంలోని తొర్లికొండ గ్రామంలో పద్మశాలి సంఘం-2 ఆధ్వర్యంలో సోమవారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం మార్కండేయకు సత్యనారాయణ పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు శేఖర్, బ్రహ్మణ్పల్లి మాజీసర్పంచ్భూమిక,పద్మశాలిసంఘంసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ, ముప్కాల్ మండల కేంద్రాలలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిలుక గోపాల్,సుదర్శన్,చిన్నయ్య, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మెండోర: మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ సభ్యులు తమ్మ రమేష్, ముక్కెర రాజేశ్వర్, నాగరాజు, దాసరి మూర్తి, ఏడేల్లి రాజు, శ్రీనివాస్, నరేష్, మహేష్, దర్మేందర్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



వేల్పూర్లో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కిసాన్ కాంగ్రెస్ నాయకులు

ఆర్మూర్రూరల్, ఫిబ్రవరి12 వేల్పూర్ మండల కేంద్రంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అన్వేష్రెడ్డి మాటాడుతూ పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టులను 2015లో శంకుస్థాపన చేసి తొమ్మిదేళ్లలో 40శాతం పనులు కూడా ఎందుకు పూర్తి చేయలేదని ఆయన ప్రశ్నించారు. నల్గొండ జిల్లాలో కృష్ణ జలాలల మీద నిర్వహిస్తున్న బహిరంగ సభ నిర్వహించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ ప్రాజెక్టుల వల్ల మహబూబ్నగర్, రంగారెడ్డి జిల్లాలకు మూడు లక్షల ఎకరాలకు, నల్గొండలోని 30వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వకుండా మాట నిలబెట్టుకోవాలని మాజీ సీఎం కేసీఆర్ సభకు ఏలా వెళ్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 60రోజుల్లోనే సీఎం రేవంత్రెడ్డి కోడంగల్, నారాయణపేట్ ఎత్తిపోతల ప్రాజెక్టులకు రూ. 2945కోట్లు విడుదల చేసి సుమారు మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఇదీ కాంగ్రెస్ పార్టీ నిబద్ధత అని కొనియాడారు. కృష్ణ నదిలో అక్రమంగా ఆంధ్ర ప్రభుత్వం నీటిని దోచుకెళ్తున్న అనాడు ఎందుకు అపలేదని అన్వేష్రెడ్డి ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నర్సారెడ్డి, అనిల్ గౌడ్, దామోదర్గౌడ్, స్వరూప, భగవన్దాస్, రమణ, రాము, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



నాగాపూర్లో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి మహేందర్రెడ్డి

ముప్కాల్, ఫిబ్రవరి12: బాల్కొండ మండలం నాగాపూర్ గ్రామంలో సోమవారం వరి పంటలను పరిశీలించి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి మహేందర్రెడ్డి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరినాట్లు వేసి 15నుంచి 25రోజుల మధ్యలో మొగిపురుగు, కాండం తొలచుపురుగు నివారణకు కార్బఫ హైడ్రాక్లోరైడ్ ప్లస్ ఇమామెక్టిన్ బెంజయిట్ మూడు కిలోలు, క్లోరాంత్ర నిలిప్రోల్ గుళికలు నాలుగు కిలోలు ఏదేని ఒకదానిని చల్లుకోవాలి. వరిపైరు 40నుంచి 60 రోజుల మధ్యలో మొగిపురుగు, కాండం తొలచుపురుగు నివారణకు కార్బఫ హైడ్రాక్లోరైడ్ 400గ్రాములు, క్లోరాంత్ర నిలిప్రోల్ 60ఎంఎల్ 200లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేయాలని అన్నారు. కిలోలు ఏదేని యాసంగి వరిలో అగ్గితెగులు వచ్చే అస్కారం ఉంటుందని, వెంటనే ట్రైసైక్లోజోల్ 120గ్రాములు, ఐసోప్రోతయోలిన్ 300ఎంఎల్లు 200లీటర్ నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలన్నారు.. ఈ కార్యక్రమంలో ఏఈవో రేష్మ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యేకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ధర్పల్లి ఫిబ్రవరి 12: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ధర్మారం వద్ద గల ఓ ఫంక్షన్హాల్లో నిర్వహించిన జన్మదిన వేడుకలకు మండలానికి పలువురు కాంగ్రెస్ నేతలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాదారి మనోహర్రెడ్డి, కృష్ణ, నర్సింగ్రావ్, మిట్టపల్లి గంగారెడ్డి, భగవంత్రెడ్డి, సురేష్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● ధర్పల్లి ప్రాథమిక పాఠశాలలో

మండల కేంద్రంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాలరాజు, జిల్లా అధికార ప్రతినిధి నర్సయ్య, చెలిమెల శ్రీనివాస్, గంగారాం, రమేష్గౌడ్, వైవీఆర్, అబ్దుల్ హమీద్, కొండయ్య, నారాయణ, బోజ్జెన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రెంజల్,ఫిబ్రవరి12: మండలంలోని నీలా గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ను పట్టుకుని పోలీస్ స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉదయ్కుమార్ తెలిపారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ను పట్టుకుని డ్రైవర్పై కేసు నమోదు చేసి తహసీల్దార్కు అప్పగించడం జరిగిందని ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు.

21నుంచి పీజీ ఇంటిగ్రేటెడ్ పరీక్షలు

డిచ్పల్లి, ఫిబ్రవరి 12: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ ఇంటిగ్రేటెడ్ కోర్సులకు రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలు ముందుగా ప్రకటించినట్లుగా ఈ నెల 17నుంచి గాకుండా 21వ తేది నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి ప్రొ.అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎంఎస్డబ్ల్యూ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంబీఏ, పీజీ 1వ సెమిస్టర్ పరీక్షలు 5సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సుల ఐఎంబీఏ, ఏపీఈ, పీఎస్హెచ్ 7వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు విద్యార్థుల కోరిక మేరకు వాయిదా వేశామని ఈ నెల 21 నుంచి తిరిగి ప్రారంభమై మార్చి 4వరకు కొనసాగుతాయన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్ సైట్ సంప్రదించలన్నారు.

తిమ్మాపూర్, గోవూర్ గ్రామాల్లో పర్మిషన్ లేకుండా వెలుస్తున్న లేఅవుట్లు

మోప్రా,ఫిబ్రవరి12:మండలంలోని తిమ్మాపూర్, గోవూర్గ్రామాల్లో గ్రామ పంచాయతీ పర్మిషన్ లేకుండానే లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పలువురు ఇష్టారీతిన లేఅవుట్లు వేసి ప్లాట్లను విక్రయిస్తున్నారు. అక్రమ లేఅవుట్లను కొనుగోలు చేస్తే ప్రజలు నష్టపోతారని పంచాయతీ కార్యదర్శులు కృష్ణ,ముతీబ్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ పర్మిషన్ ఉన్న లేఅవుట్లను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు.అక్రమలేఅవుట్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టీయూ పరిధిలో ఎంఎడ్ పరీక్షలు ప్రశాంతం

డిచ్పల్లి, ఫిబ్రవరి 12: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఎంఎడ్ 1,2,3వ సెమిస్టర్ బ్యాక్లాగ్, 2వ సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షలు గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో సోమవారం 9వ రోజు ఏలాంటి మాస్ కాపీయింగ్ లేకుండా ప్రశాంతంగా జరిగాయని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యం కోసమే విటమిన్ ఏ ద్రావణం

బోధన్ రూరల్, ఫిబ్రవరి 12: 9 నెలల నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో సోమవారం బోధన్ పట్టణంలోని అంగన్వాడీ సెంటర్లు, ఆరోగ్య కేంద్రాలలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్వో డాక్టర్ విద్య ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు విటమిన్ ఎ ద్రావణాన్ని వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలలో విటమిన్ ఎ లోపం వలన కలిగే వ్యాధులు రేచీకటి, ఇతర కంటి సంబంధ వ్యాధులు, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్ ఏ ద్రావణం తోడ్పడుతుందని వివరించారు. 9 నెలల నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీ సెంటర్, ఆరోగ్య కేంద్రాల్లోకి తీసుకెళ్లి విటమిన్ ఏ ద్రావణాన్ని వేయించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు పడిన వ్యక్తి మృతి

బోధన్ రూరల్, ఫిబ్రవరి 12: బోధన్ మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో సోమవారం నీలకంఠ్ గాటే (45) అనే వ్యక్తి కాలుజారి ప్రమాదవశాత్తు పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు రూరల్ ఏఎస్సై రవీందర్ తెలిపారు. కుటుంబ సభ్యులు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

అదనపు కలెక్టర్గా కిరణ్కుమార్ బాధ్యతలు



స్వాగతం పలుకుతున్న అధికారులు

నిజామాబాద్అర్బన్ , ఫిబ్రవరి 12: జిల్లా అదనపు కలెక్టర్గా (రెవెన్యూ)ఎస్.కిరణ్కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్లో బాధ్యతలు చేపట్టారు.అంతకుముందు ఆయన కలెక్టర్ రాజీవ్గాంధీహన్మంతు, సీపీ కల్మేశ్వర్శింగేనేవార్కు మర్యాదపూర్వకంగా కలిసారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఇటీవల అదనపు కలెక్టర్గా కొనసాగిన యాదిరెడ్డిని ప్రభుత్వం బదిలీ చేయగా కిరణ్ కుమార్ను అదనపు కలెక్టర్గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. బాధ్యతలు స్వీకరించిన కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, కార్యాలయ సిబ్బంది. వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా గణపతి ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న పురోహితుడు

బోధన్ రూరల్, ఫిబ్రవరి 12: బోధన్ పట్టణంలోని రాకాసిపేట్లో గల సంకట విమోచన గణపతి ఆలయంలో 6వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో అభిషే కా లు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ ఆరోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ దేశాయ్,వెంకటేశ్వరరావు దేశాయ్, వెంకటేశ్వరావు,అర్జున్, యాదవరావు,అజయ్లతో ఆలయక మిటీనిర్వాహకులుతదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్స్కిన్	స్కిన్లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.215	రూ. 240
వెన్కాబ్(కిలో)	: రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,200	రూ.59,200	రూ.750

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : లాల్సలామ్ (12.00,3.15,9.45)
: హనుమాన్ (6.30)
స్క్రీన్-2 : ఈగల్ (12.20,7.00)
: హనుమాన్ (3.40)
:ట్రూలవర్ (10.20)
స్క్రీన్-3 :తేరి బాతోన్మే అయిసాఉల్జాదీయా (10.15)
: యాత్ర-2 (1.25,7.15,10.20)
:ట్రూలవర్ (4.20)
స్క్రీన్-4 :కెమరామెన్ గంగాతో రాంబాబు (12.25)
:తేరి బాతోన్మే అయిసాఉల్జాదీయా (3.40,6.50,10.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1: ఈగల్ (10.30,1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : యాత్ర-2 (1.30,,10.35)
:అంబాజీపేటమ్యారేజీబ్యాండ్ (4.35)
:లాల్సలామ్ (7.35)
స్క్రీన్-3 :ట్రూలవర్ (10.40, 1.35, 4.25,10.30)
:హనుమాన్ (7.25)

దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహోల్ : ఈగల్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : లాల్సలామ్ (11.15, 6.15,)
:యాత్ర-2 (2.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్